ఎడిటర్ :
మంచె శరత్ చంద్ర
సంపుటి : 13
సంచిక : 236
పేజీలు : 5 వెల రూ. 2/-
గురువారం
11 డిసెంబర్ 2025
PUBLISHED FROM :
HYDERABAD

AM న్యూస్
ప్రతిదినం ప్రత్యేకం
www.amnews7.com

## గ్లోబల్ సమ్మిట్ పేరుతో రియల్ దోపిడీ ప్లాన్

రైజింగ్ సమ్మిట్ అట్టర్ ఫ్లాప్ అయ్యిందన్న హరీష్




2 లో

# నేడే తొలివిడత పంచాయితీ పోరు

- ఎన్నికల నిర్వహణకు సర్వసిద్ధం
- తొలి విడతలో మొత్తం 189 మండలాలు
- 4,236 గ్రామపంచాయతీలు, 37,440 వార్డులు
- రాష్ట్రవ్యాప్తంగా 37,562 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు
- తొలి విడతలో ఓటేయనున్న 56,19,430 మంది ఓటర్లు
- గ్రామాల్లో భారీగా బందోబస్తు ఏర్పాటు
- ఉదయం 7 నుంచి 1 గంటవరకు పోలింగ్
- మధ్యాహ్నమే ఓట్ల లెక్కింపు...ఫలితం ప్రకటన
- వివరాలు వెల్లడించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని

2 లో



## గ్లోబల్ సమమిట్‌తో ఊహించని విధంగా పెట్టుబడులు

- పేరెన్నిక గన్న కంపెనీలతో పలు ఒప్పందాలు..
- ముందస్తు కార్యక్రమాలతోనే రాహుల్, ఖర్గేలు రాలేదు..
- త్వరలోనే పార్టీ పదవుల భర్తీని పూర్తి చేస్తాం..
- మీడియా సమావేశంలో పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్..



2 లో

# ఉస్మానియా వర్సిటీకి మహర్దశ

- వెయ్యికోట్లు విడుదలకు సిఎం రేవంత్ అంగీకారం
- వెంటనే విడుదలకు విద్యాశాఖ ఉత్తర్వులు
- అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధికి కంకణం
- తెలంగాణ ఉద్యమంలో ఉస్మానియాదే కీలకం
- ధైర్యంతో కాదు... గుండెనిండా ప్రేమతో ఇక్కడికి వచ్చా
- చదువు రాకున్నా.. చదువు విలువ తెలిసినోడిని
- ఉస్మానియా సభలో సిఎం రేవంత్ భావోద్వేగ ప్రసంగం

2 లో



## ఆర్టీసికి 65 కొత్త ఎలక్ట్రిక్ బస్సులు

- కాలుష్య నివారణ లక్ష్యంగా కృషి
- బస్సులను ప్రారంభించిన మంత్రి పొన్నం




2 లో

## ఫ్రస్టేషన్‌లో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం

- అన్ని ఆరోపణలకు ఆధారాలతో సమాధానమిస్తా..
- మీడియా సమావేశంలో జాగృతి అధ్యక్షురాలు కవిత



2 లో

# నేడే తొలివిడత పంచాయితీ పోరు


ఏఎం న్యూస్, హైదరాబాద్,డిసెంబర్10:
తెలంగాణ రాష్ట్రంలో తొలి విడత గ్రామపంచాయతీ ఎన్నికలకు రంగం సిద్ధం అయ్యింది. ఇప్పటికే జోరుగా ప్రచారం నిర్వహించిన అభ్యర్థులు నేటి ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. గతంలో ఎప్పుడూ లేనంతగా పంచాయితీ ఎన్నికల్లో పోటీ పెరిగింది. తెలంగాణలో తొలి దశ గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ గురువారం జరగనున్నాయి. హైదరాబాద్‌లో ఎస్ఈసీ రాణి కుముదిని విలేకర్లతో మాట్లాడుతూ.. తొలి దశ పల్లె పోరుకు సర్వం సిద్ధం చేసినట్లు తెలిపారు. గురువారం ఉదయం 7.00 గంటల నుంచి ఈ పోలింగ్ ప్రారంభమవుతుందన్నారు. ఈ తొలి దశలో 56,19,430 మంది ఓటర్లు.. తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని చెప్పారు. ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని వెల్లడించారు. గురువారం జరగనున్న తొలి విడత సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరగేలా విస్తృత చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. తొలి విడతలో మొత్తం 189 మండలాలు, 4,236 గ్రామపంచాయతీలు, 37,440 వార్డులు ఎన్నికల పక్రియలో భాగంగా ఉన్నాయి. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 37,562 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయగా, తొలి విడతలో 56,19,430 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించు కోనున్నారు. వీరిలో 27,41,070 మంది పురుషులు, 28,78,159 మంది మహిళలు, 201 మంది ఇతరులు ఉన్నారు. తొలి విడతలో 395, రెండో విడతలో 495 గ్రామాల్లో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయని చెప్పారు. ఇప్పటి వరకు తనిఖీల్లో రూ.8.2 కోట్లు సీజ్ చేశామని వివరించారు. 50వేల మంది సివిల్ పోలీసులు విధుల్లో ఉంటారని, 60 ప్లటూన్స్ బృందాలు బయటి నుంచి వచ్చాయని ఎస్ఈసీ తెలిపారు.ఎన్నికల నిర్వహణ కోసం సుమారు లక్ష మంది ఎన్నికల సిబ్బందిని నియమించామని కమిషనర్ తెలిపారు. ఇందులో 3,591 మంది రిటర్నింగ్ అధికారులు, 93,905 మంది పోలింగ్ సిబ్బంది ఉన్నారు. అలాగే ఎన్నికల పక్రియను పర్యవేక్షించేందుకు 2,489 మైక్రో అబ్జర్వర్లను నియమించారు. పారదర్శకత కోసం 3,461 పోలింగ్ స్టేషన్లలో వెబ్‌కాస్టింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. మొత్తం 45,086 బ్యాలెట్ బాక్సులు వినియోగించనున్నారు. ఓటర్ సౌలభ్యం దృష్ట్యా 99 శాతం ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తయ్యిందని కమిషనర్ వెల్లడించారు. మిగతా ఓటర్లు 'టీఎస్ ఈ-పోల్ మొబైల్ యాప్' ద్వారా కూడా తమ ఓటర్ స్లిప్‌ను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం ఉందన్నారు. అలాగే ఓటింగ్ కేంద్రం తెలుసుకునేందుకు అదే యాప్ ఉపయోగపడుతుందని తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో భాగంగా ఇప్పటివరకు 3,214 ఎఫ్ఐఆర్లు నమోదు చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా.. 31,428 మందిని బైండోవర్ చేసినట్లు, 902 లైసెన్స్ ఆయుధాల డిపాజిట్, రూ.7.54 కోట్ల విలువైన నగదు, మద్యం, డ్రగ్స్, విలువైన లోహాల స్వాధీనం చేసినట్లు రాణి కుముదిని వెల్లడించారు. నిన్న సాయంత్రం నుంచే మద్యం దుకాణాలు మూసివేశామని ఆమె తెలిపారు. భద్రతా చర్యలలో భాగంగా 31 జిల్లాల అధికారులకు మేజిస్ట్రేట్ పవర్స్ ఇచ్చామని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్, రెవెన్యూ యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తోందన్నారు. ఎన్నికల ప్రచారం కూడా మంగళవారం సాయంత్రం 5 గంటలతో ముగిసింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఓటర్లకు విజ్ఞప్తి చేస్తూ, భయభ్రాంతులు లేకుండా ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

ప్రజాస్వామ్య బలోపేతంలో ఓటు కీలకమని పేర్కొంటూ, గ్రామాల భవిష్యత్తు నిర్ణయంలో ఓటు శక్తిని గుర్తించాలని ఆమె అన్నారు. అబ్జర్వర్లు, మైక్రో అబ్జర్వర్లతో ఈ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద సీసీ కెమెరా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ ఎన్నికల విధుల్లో లక్ష మందికి పైగా సిబ్బంది పాల్గొనున్నారని వివరించారు. ఈ ఎన్నికల్లో ఓటర్లు 18 రకాల ఐడి కార్డులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఏ రకమైన ఐడి కార్డును పోలింగ్ బూత్ అధికారులకు చూపించిన ఓటు వేయవచ్చునన్నారు. ఇక మంగవారం నుంచి ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో వైన్ షాపులన్నీ మూసి వేసినట్లు చెప్పారు. అన్ని జిల్లాల కలెక్టర్లకు మేజిస్ట్రియల్ పవర్స్ ఇస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు ఎస్ఈసీ వివరించారు. బందోబస్తు, శాంతిభద్రతల అంశాన్ని పోలీసులు పరిశీలిస్తున్నారని చెప్పారు. పోలింగ్ పూర్తికాగానే కౌంటింగ్ జరుగుతుందన్నారు.

# ఆర్టీసికి 65 కొత్త ఎలక్ట్రిక్ బస్సులు

ఏఎం న్యూస్, హైదరాబాద్,డిసెంబర్10:
తెలంగాణ రాష్ట్రంలో ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్యను గణనీయంగా పెంచుతూ, ఆర్టీసీని కాలుష్య రహిత ప్రజా రవాణా వ్యవస్థగా మార్చడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను కూడా త్వరలోనే పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. రాణిగంజ్ ఆర్టీసీ డిపోలో 65 కొత్త ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించిన సందర్భంగా మంత్రి ఈ వివరాలను వెల్లడించారు. ప్రస్తుతం తెలంగాణ ఆర్టీసీలో 810 ఎలక్ట్రిక్ బస్సులు పరుగులు పెడుతున్నాయి. ఇందులో జంట నగరాల పరిధిలో 300కు పైగా బస్సులు తిరుగుతున్నాయి.జనవరి చివరి నాటికి మరో 175 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి రానున్నాయి. అత్యాధునిక 'పీఎం ఈ-డ్రైవ్' పథకం కింద అతి త్వరలో ఏకంగా 2,800 కొత్త ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పక్రియ దశలవారీగా ఒకటి లేదా రెండు సంవత్సరాలలో పూర్తవుతుందని మంత్రి తెలిపారు. ఆర్టీసీ రవాణా వ్యవస్థను ఈవీ బస్సుల ద్వారా ముందుకు తీసుకువెళ్లి, హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఆర్టీసీ సేవలను విస్తరించడంలో భాగంగా త్వరలో 373 కొత్త ప్రాంతాలకు బస్ కనెక్టివిటీని అందిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇంటర్ సిటీ ట్రాన్స్‌పోర్టేషన్ కింద వరంగల్, ఖమ్మం, నల్గొండ వంటి చుట్టుపక్కల జిల్లాల నుండి హైదరాబాద్‌కు ఈవీ బస్సులను ప్రారంభం చేసినట్లు ఆయన వివరించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ బస్సుల విస్తరణ జరుగుతోందని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, మహాలక్ష్మి పథకం అమలు ద్వారా ఆర్టీసీ వ్యవస్థ లాభాల బాట పట్టిందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆర్టీసీ కార్మికులకు భరోసా ఇస్తూ, వారి సమస్యలన్నీ అతి త్వరలో పరిష్కారమవు తాయని హామీ ఇచ్చారు. ప్రజా పాలన ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మహాలక్ష్మి పథకం ప్రారంభించి రెండేళ్లు పూర్తి చేసుకున్నామన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే ఆర్టీసీలో ఉచిత ప్రయాణం ప్రారంభించినట్లు తెలిపారు. ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్, శ్రామిక్, ఇతర సిబ్బంది ఎంతో శ్రమిస్తున్నారని.. వారందరికీ అభినందనలు చెప్పారు. ఇప్పటికీ 251 కోట్ల మంది మహిళలు.. రూ.8,500 కోట్ల విలువైన ప్రయాణాలు చేశారన్నారు. హాస్పిటల్స్, దేవాలయాలు, ఉద్యోగులు, బంధువుల ఇంటికి, స్కూళ్లకు రాకపోకలు సాగించారన్నారు. దేవాదాయ శాఖ ఆదాయం మహాలక్ష్మి పథకం ద్వారా పెరిగిందన్నారు. రెండేళ్లలో ప్రస్తుతమున్న 40శాతం బస్సులను కొనుగోలు చేయడం జరిగిందని.. ఆర్టీసీలో కొత్త రక్తం వస్తుందన్నారు. కొత్తగా డ్రైవర్లు, కండక్టర్లు, శ్రామిక్స్ వస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆర్టీసీ బస్సులకు మహిళలను యజమానుల చేసిందన్నారు. ఢిల్లీ లో నివాస యోగ్యం లేకుండా కాలుష్యం ఉన్న పరిస్థితి ఉందని.. ఇక్కడ అలాంటి పరిస్థితి రాకుండా రవాణా శాఖ ఈవీ పాలసీ, స్క్రాప్ పాలసీ తీసుకొచ్చిందన్నారు. ఆర్టీసీ సంస్థ పరిరక్షణ, ఉద్యోగుల సంక్షేమం, ప్రయాణికుల భద్రత దృష్టిలో పెట్టుకుందన్నారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న అనేక అంశాలు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రయాణికులకు సౌకర్యంగా ఈవీ బస్సులు సమ్మక్క సారలమ్మ జాతర, శ్రీశైలం, యాదాద్రికి రాకపోకలు సాగిస్తాయన్నారు. ప్రత్యేక బస్సులు బస్సులు, నూతన బస్ డిపోల ఏర్పాటు, బస్ స్టేషన్లను అభివృద్ధి చేసుకుంటున్నామన్నారు. 1932లో ప్రారంభించిన ఆల్బియన్ బస్సు, మధ్యలో వచ్చిన ఎర్రబస్సు, ప్రస్తుతం నడుస్తున్న ఎలక్ట్రిక్ బస్సు అక్కడ ఎగ్జిబిషన్ పెట్టినట్లు చెప్పారు. ఎయిర్‌పోర్ట్‌లో ఇబ్బందులు వచ్చినా దగ్గరలో ఉన్న ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు నడిపినట్లు చెప్పారు. ప్రజారవాణాలో మరిన్ని నిర్ణయాలు తీసుకుంటామని.. ఈవీ బస్సుల ప్రారంభోత్సవంతో నగరంలో మరింత మెరుగ్గా బస్సులు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. ఈవీ పాలసీని తీసుకువచ్చామని.. నగరంలో కాలుష్యాన్ని తగ్గించేందుకు ఈవీ, సీఎన్‌జీ, ఎల్‌పీజీ ఆటోలకు అనుమతి ఇచ్చినట్లు చెప్పారు. బస్సుల ప్రారంభోత్సవం సందర్భంగా నగర ప్రజలకు మంత్రి పొన్నం శుభాకాంక్షలు తెలిపారు.

# ఉస్మానియా వర్సిటీకి మహర్దశ




ఏఎం న్యూస్, హైదరాబాద్,డిసెంబర్10:
ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దాలనే సంకల్పంతో వచ్చానని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. తెలంగాణ తొలి,మలి దశ ఉద్యమాలకు ఉస్మానియానే కేంద్రమని అన్నారు. ఎన్నో ఉద్యమాలకు ఇది వేదికగా నిలిచిందన్నారు. ఆధిపత్యానికి వ్యతిరేకంగా తెలంగాణలో అనేక పోరాటాలు వచ్చాయి. నిజాం, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం జరిగింది. సామాన్యులైన చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య.. దొరలపై పోరాడారు. ఉమ్మడి రాష్ట్రంలో న్యాయం జరగలేదని తెలంగాణ ఉద్యమం వచ్చింది. ఉద్యమాన్ని ఉస్మానియా నుంచే విద్యార్థులు ప్రారంభించారు. గతంలో ఈ వేదిక నుంచే స్వరాష్ట్ర ఆకాంక్షను విద్యార్థులు బలంగా వినిపించారు. పోరాడి సాధించిన రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలు నెరవేరాయా.. లేదా.. అని ఇక్కడే తెలుసుకోవాలని అనుకున్నానని అన్నారు. బుధవారం ఉస్మానియా వర్సిటీని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఓయూకు రూ.1000 కోట్ల నిధులను సీఎం విడుదల చేశారు. ఈ నిధులను విద్యార్థులకు అంకితం చేశారు. అలాగే, ఓయూ అభివృద్ధికి రూ.45 లక్షల చెక్కు పూర్వ విద్యార్థులు అందజేశారు. అనంతరం ఆర్ట్స్ కాలేజీ భవనం దగ్గర 'సర్వం సిద్ధం' పేరుతో నిర్వహించిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. స్వరాష్ట్ర ఆకాంక్షను బలంగా ఉస్మానియా యూనివర్సిటీ వినిపించిందని తెలిపారు. భవిష్యత్తు ప్రణాళికలపై చర్చించడానికి ఓయూకు వచ్చానని వివరించారు. గతంలో ముఖ్యమంత్రులను అడ్డుకున్న చరిత్ర ఉందని ప్రస్తావించారు. మీరు ఎందుకు ఓయూకు వెళ్లే ధైర్యం చేస్తున్నారని కొంతమంది తనతో అన్నారని గుర్తుచేశారు. మీరిచ్చే సూచనలు, మేధావులు ఇచ్చే సలహాలతో ఓయూను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతానని స్పష్టం చేశారు. విద్యార్థులకు తమ ప్రభుత్వం అండగా ఉండాలనే ఓ ఆలోచనతో ఇక్కడకు వచ్చానని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ధైర్యంతో కాదని.. విద్యార్థుల గుండెల నిండా ఉన్న అభిమానంతో ఆర్ట్స్ కాలేజీ వద్దకు వచ్చానని వ్యాఖ్యానించారు. తమ ప్రసంగాలు చదువుకొని కాదని.. తన మనసులో ఉన్నది చెప్పాలని ఇక్కడకు వచ్చానని చెప్పుకొచ్చారు. పురాతన యూనివర్సిటీలో ఉస్మానియా ఒకటని వివరించారు. ఉస్మానియా యూనివర్సిటీకి గొప్ప చరిత్ర ఉందని అభివర్ణించారు. ఇక్కడకు రావాలంటే ధైర్యం కాదని.. అభిమానం కావాలని చెప్పుకొచ్చారు. తెలంగాణలో చదువు లేకున్నా ఆధిపత్యాన్ని సహించరని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ప్రాంతానికి ఒక చైతన్యం, పౌరుషం ఉంది. ఎందరో ఓయూ విద్యార్థులు రాష్ట్రం కోసం ఆయుధాలతో అడవిబాట పట్టారు. గద్దర్, జార్జిరెడ్డి, పీవీ నరసింహారావు వంటి ఎంతోమంది ప్రముఖులను ఈ యూనివర్సిటీ ఇచ్చింది. బడికి వెళ్లని ఓ పేదింటి బిడ్డ అందెశ్రీ.. జయజయహే తెలంగాణ నినాదాన్ని అందించారు. సమాజానికి ఏ సమస్య వచ్చినా ఈ యూనివర్సిటీ విద్యార్థులు కదం తొక్కారు. రాష్ట్రం ఏర్పడ్డాక ఎవరి ఆస్తిలో వాటా అడగలేదు.. కేవలం స్వేచ్ఛ, సమాన అవకాశాలు మాత్రమే అడిగారు. మీరు ఎదిగేందుకు ఈ ప్రభుత్వం స్వేచ్ఛను ఇస్తుంది. ప్రపంచానికే మీరు దిక్సూచిగా మారాలి. ఎవరి గురించీ రాజకీయ వ్యాఖ్యలు చేయాలనుకోవడం లేదు. కొందరు రెండేళ్లుగా మాట్లాడుతున్నారు. నేను గుంటూరులో చదువుకోలేదు.. గూడుపుఠాణీలు చేయలేను. గుంటూరులో చదువుకున్న వాళ్లు బెంజ్ కారులో వెళ్లి పేదరికం గురించి తెలుసుకుంటారు. గుంటూరు, పుణె, అమెరికాలో చదువుకున్నాం అని ఉపన్యాసాలు ఇవ్వడం ద్వారా ఏం చెప్పాలని అనుకుంటున్నారు? నాకు భాష సరిగా రాకపోవచ్చు.. కానీ పేదవాడిని అర్థం చేసుకునే భాష వచ్చు. పేదవాడి బిడ్డ చదువుకుంటే ఎలాంటి ప్రయోజనం ఉంటుందో నాకు తెలుసు. పేదలు, నిస్సహాయులకు అండగా ఉండేలా చర్యలు చేపడుతున్నాం. నేను ఫాంహౌస్‌లు కట్టించుకోలేదు.. సాధారణంగానే ఉన్నా. రాష్ట్ర ముఖ్యమంత్రిగా, మీ సోదరుడిగా ఈ ఆర్ట్స్ కాలేజీ ముందు నిలుచున్నా. చరిత్రలో సజీవంగా నిలబడే కార్యక్రమాలు చేయాలని అనుకుంటున్నా. జయజయహే తెలంగాణ గీతం, తెలంగాణ తల్లిని ఆవిష్కరించుకున్నాం. వర్గీకరణ ద్వారా దళితుల సమస్యను శాశ్వతంగా పరిష్కరించాం. జనగణనలో కులగణన చేపట్టి వందేళ్ల సమస్యను పరిష్కరించాం. ప్రభుత్వం దగ్గర పంచేందుకు డబ్బు లేదు. దళితులకు మూడెకరాల భూమి ఇస్తామన్నారు.. గత పదేళ్లలో ఎవరికైనా ఇచ్చారా? భూములు ఉన్న ఆసాములు కూడా వెనుకబాటుతనంతో బాధపడు తున్నారు. దాన్ని నిర్మూలించాలంటే ప్రతి గ్రామంలో విద్యావకాశాలు పెంచాలి. నాణ్యమైన విద్య, స్కిల్స్‌ను అందించేందుకు కృషి చేస్తున్నాం. విద్య ఒక్కటే మన ఆత్మగౌరవాన్ని పెంచుతుందన్నారు. విద్యాలయాల్లో కుల వివక్ష ఉండకూడదనే యంగ్ ఇండియా స్కూల్స్‌లో అందరూ కలిసి చదువుకునేలా చర్యలు చేపట్టాం. డబ్బు ఉన్నవాళ్లు ఎక్కడికి వెళ్లి అయినా చదువుకోగలరు. పేదింటి విద్యార్థులకు ఉస్మానియా యూనివర్సిటీ నాణ్యమైన విద్యను అందించాలి. మంజూరు చేసిన రూ.1000 కోట్లు డబ్బుగా కాదు.. భవిష్యత్తు తరాలకు పెట్టుబడిగా చూస్తున్నాం. ఉత్తుత్తి మాటలు చెప్పను.. మన చేనుకి చీడ పడితే ఏ మందు కొట్టాలో నాకు తెలుసు. నాకు ఇంగ్లీష్ రాదని వాళ్లు అనుకుంటున్నారు. చైనాకు కూడా ఆ భాష రాదు.. కానీ ఆ దేశం ప్రొడక్షన్ నిలిపివేస్తే అమెరికా కూడా విలవిలలాడుతుంది. భాష కేవలం కమ్యూనికేషన్ కోసం మాత్రమే.. అది నాలెడ్జ్ కాదు. రాష్ట్రానికి ఓయూ గుండెకాయ లాంటిది. సమస్యల మీద కొట్లాడతానంటే నేను వద్దు అనను. రాజకీయ పార్టీల మోచేతినీళ్లు తాగాలని.. వాళ్ల జెండాలు మోయాలని అనుకోవద్దు. మీ స్వతంత్రతను నిలబెట్టుకోండని రేవంత్ అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీకి ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. రూ.వెయ్యి కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రూ.వెయ్యికోట్ల నిధుల విడుదల జీవోను విద్యార్థులకు అంకితం చేస్తున్నట్లు సీఎం పేర్కొన్నారు.






# ఫ్రస్టేషన్‌లో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం

ఏఎం న్యూస్, హైదరాబాద్,డిసెంబరు10:
కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తనను వ్యక్తిగతంగా టార్గెట్ చేయటం ఆయన ఫస్ట్రేషన్‌ను బయట పెడుతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ఆయన చేసిన అన్ని ఆరోపణలకు ఆధారాలతో సహా వివరణ ఇస్తానన్నారు. కూకట్‌పల్లిలో 15 ఏళ్లుగా ఉన్న సమస్యలనే తాను చెప్పానని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడిన మాటలకు ఫీలయ్యేది లేదని... ప్రజలు అన్నీ గమనిస్తున్నారని అన్నారు. జాగృతి జనం బాటలో భాగంగా ఐదు రోజుల పాటు హైదరాబాద్ జిల్లాలో పర్యటిస్తామని తెలిపారు. నేడు కంటోన్మెంట్‌లోని బోయినపల్లి గవర్నమెంట్ స్కూల్‌ను సందర్శించినట్లు చెప్పారు. మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా ఈ స్కూల్‌ను బాగు చేశారని.. కానీ కాంపౌండ్ వాల్, సీసీ కెమెరాలు లేవన్నారు. వాటిని తాము ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ స్కూళ్లోనే అంగన్ వాడీని కూడా కలిపారని... కానీ అంగన్‌వాడీలో హెల్పర్లు లేరన్నారు. జనం బాటలో భాగంగా విద్య, వైద్యం మీద ఫోకస్ పెట్టామని వెల్లడించారు. స్కూల్స్, హాస్పిటల్స్‌లో మౌలిక వసతులు ఎలా ఉన్నాయన్నది పరిశీలిస్తున్నామన్నారు. ఇండ్లు, ఇళ్ల పట్టాలను లేని వారి సమస్యలు కూడా తెలుసుకుంటున్నామన్నారు. తమ వరకు చేయగలిగేది ఒక సంస్థగా చేస్తామని స్పష్టం చేశారు. టాప్ టెన్ విద్యార్థులకు జాగృతి తరఫున స్కాలర్ షిప్‌లు ఇస్తామని ప్రకటించారు. ఏ జిల్లాకు వెళ్లినా ప్రజల నుంచి ఆదరణ, సమస్యలు పరిష్కరించే అవకాశం ఉంటోందన్నారు. ప్రజల సమస్యలను వీలైనంతగా పరిష్కరిస్తామని ప్రకటించారు. గత ప్రభుత్వంలో తనను నిజామాబాద్‌కే పరిమితం చేశారని.. అప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా ఏం జరుగుతుందో చూడలేదన్నారు. తెలంగాణ వచ్చాక ఏం జరిగింది... ఏం జరగలేదన్నది జనం బాట కార్యక్రమం ద్వారా తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. తాము చేయగలిగేవి చేస్తామని... మిగిలిన సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. మంచిని మంచి, చెడును చెడు అనే అంటామని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో ప్రతిపక్షం పట్టించుకోవటం లేదని... పాలక పక్షం అసలే పట్టించుకుంట లేదని.. అందుకే జాగృతి జనం గళమై పనిచేస్తోందని కవిత పేర్కొన్నారు.

# గ్లోబల్ సమమిట్‌తో ఊహించని విధంగా పెట్టుబడులు

ఏఎం న్యూస్, హైదరాబాద్,డిసెంబర్10:
గ్లోబల్ సమ్మిట్‌తో ఊహించని స్థాయిలో తెలంగాణకు పెట్టుబడులు వచ్చాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చెప్పుకొచ్చారు. పేరుగాంచిన కంపెనీలతోనే తమ ప్రభుత్వానికి ఒప్పందాలు జరిగాయని వివరించారు. ముందు కొన్ని కార్యక్రమాలు ఫిక్స్ కావడంతో ఏఐసీసీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే ,రాహుల్ గాంధీ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు రాలేకపోయారని తెలిపారు. బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో మహేశ్ కుమార్ గౌడ్ చిట్‌చాట్ చేశారు.తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై శ్వేతపత్రం విడుదల చేసే దమ్ము తమకు మాత్రమే ఉందని పేర్కొన్నారు. శ్వేతపత్రం అంటే బీఆర్ఎస్‌కు భయమని ఎద్దేవా చేశారు మహేశ్ కుమార్ గౌడ్. ఫ్యూచర్ సిటీ భవిష్యత్‌లో గొప్పగా ఉంటుందని తెలిపారు. త్వరలో వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్ట్‌లు భర్తీ చేస్తామని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. టీపీసీసీ నియామకం జరిగిన రోజే డీసీసీలతో మినహా అన్ని పోస్టులు రద్దు అవుతాయని తెలిపారు. ఈనెల చివరి నాటికి కార్పొరేషన్ చైర్మన్‌లు, డైరెక్టర్ పోస్టులు భర్తీ చేస్తామని చెప్పుకొచ్చారు. లంబాడాలకు నాలుగు జిల్లాలకు అధ్యక్షులను నియమించామని తెలిపారు. ఎస్టీలకు కాంగ్రెస్ పార్టీలో తగిన ప్రాధాన్యం ఉంటుందని వివరించారు. గ్లోబల్ సమ్మిట్ సక్సెస్ చూడలేక మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. లావాదేవీలలో భాగంగానే కవిత - బీఆర్ఎస్ నేతల మధ్య విమర్శలు చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కవిత కారణంగా బీఆర్ఎస్ కబ్జాలు అన్ని బయటకు వస్తున్నాయని విమర్శించారు. కవిత ఆరోపణలపై విచారణ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. తాను టీపీసీసీగా చాలా సంతృప్తిగా ఉన్నానని స్పష్టం చేశారు. ఆర్గనైజేషన్ అంటే తనకు ఇష్టమని చెప్పుకొచ్చారు. మీడియాలోనే తనకు డిప్యూటీ సీఎం పదవి ఇస్తున్నారని చెబుతున్నారని.. అప్పుడే మంత్రి పదవి ఇస్తున్నారంటూ కూడా ఊహాగానాలు వస్తున్నాయని తెలిపారు. లోక్‌సభలో ప్రియాంక గాంధీ చాలా బాగా మాట్లాడారని ప్రశంసించారు మహేశ్ కుమార్ గౌడ్. పశ్చిమ బెంగాల్ ఎలక్షన్ కోసం వందేమాతరాన్ని బీజేపీ తెరపైకి తెచ్చిందని విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జవాహర్ లాల్ నెహ్రూను విమర్శిస్తూ జీవితంలో అతిపెద్ద పొరపాటు చేశారని మండిపడ్డారు. నెహ్రూ వల్లే దేశం వెనకబడిందని బీజేపీ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఉస్మానియా విశ్వవిద్యాలయానికి వెళ్లాలంటే బయ పడ్డారని ఎద్దేవా చేశారు. 1965లో ఇందిరాగాంధీ ఆర్ట్స్ కాలేజీకి వచ్చారని... 60 సంవత్సరాల తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి ఆర్ట్స్ కాలేజీకి వెళ్లడం చరిత్రగా నిలిచిందని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# గ్లోబల్ సమ్మిట్ పేరుతో రియల్ దోపిడీ ప్లాన్

ఏఎం న్యూస్, హైదరాబాద్,డిసెంబర్10:
కాంగ్రెస్ సర్కార్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌పై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించిన ఆయన.. ఇది గ్లోబల్ సమ్మిట్ కాదని.. భూములు అమ్ముకునేందుకు ఏర్పాటు చేసిన రియల్ ఎస్టేట్ సమ్మిట్ అంటూ వ్యాఖ్యలు చేశారు. అందాల పోటీల్లాగే, ఏఐ సమ్మిట్ లాగే.. గ్లోబల్ సమ్మిట్ కూడా అట్టర్ ఫ్లాప్ షో అయ్యిందంటూ కామెంట్స్ చేశారు. పెట్టుబడుల కట్టు కథలు చెప్పి, కోట్లు ఖర్చు చేసి గ్లోబల్ సమ్మిట్‌ను అట్టర్ ఫ్లాప్ చేశారంటూ ఫైర్ అయ్యారు. గ్లోబల్ సమ్మిట్ పేరిట రియల్ ఎస్టేట్ స్కాంకు తెరతీశారంటూ మాజీ మంత్రి సంచలన ట్వీట్ చేశారు. 'విజన్ డాక్యుమెంట్‌లో విజన్ లేదు, దాన్ని చేరుకునే మిషన్ లేదు, విజన్ డాక్యుమెంట్ కాదు.. 'విజన్ లెస్' డాక్యుమెంట్. క్యూర్, ప్యూర్, రేర్ అంటూ అంటున్న రేవంత్ రెడ్డి.. తెలంగాణను కొల్లగొడుతున్న చోర్. గ్లోబల్ సమ్మిట్‌లో ఎంవోయూల వెనుక చీకటి ఒప్పందాలు, అంకెల గారడీ తప్ప ప్రజలకు పనికొచ్చే పనులు ఏవీ లేవు. రెండేళ్లుగా కోట్లు ఖర్చు చేసి తిరిగిన దేశాలు, నిర్వహించిన సమ్మిట్స్ ద్వారా మొత్తం ఎన్ని కోట్ల పెట్టుబడులు వచ్చాయి? అందులో ఎన్ని కంపెనీలు గ్రౌండ్ అయ్యాయి? ఎంత మంది తెలంగాణ బిడ్డలకు ఉద్యోగాలు వచ్చాయి.. దమ్ముంటే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్. కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధి గురించి గ్లోబల్ సమ్మిట్ వేదికగా టోనీ ÷-లబెయిర్, సుబ్బారావు ఇచ్చిన కితాబు రేవంత్ రెడ్డికి చెంపపెట్టు. రేవంత్ రెడ్డి నిర్వహించింది గ్లోబల్ సమ్మిట్ లాగా లేదు, భూములు అమ్మకునేందుకు ఏర్పాటు చేసిన రియల్ ఎస్టేట్ సమ్మిట్' అంటూ హరీష్ రావు ఎక్స్‌లో ట్వీట్ చేశారు.

# వివేకానంద నగర్ డివిజన్లో ఘనంగా విజయ్ దివాస్ కార్యక్రమం

ఏ ఎమ్ న్యూస్ శేర్లింగంపల్లి :



శేర్లింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్‌లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పిలుపు మేరకు డిసెంబర్ 9 'విజయ్ దివాస్' సందర్భంగా మంగళవారం ఉదయం రిక్షా పుల్లర్స్ కాలనీ అంబేద్కర్ విగ్రహం వద్ద డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు అంబేద్కర్ కి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు పడ్డ తొలి అడుగు విజయాన్ని సూచిస్తూ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, ఉద్యమకారులు, విద్యార్థి నాయకులు మరియు కార్యకర్తలతో కలిసి పింక్ బెలూన్లను గాలిలోకి వదిలారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డిసెంబర్ 9 అనేది తెలంగాణ చరిత్రలో ఒక అపూర్వమైన రోజు అని అన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు నవంబర్ 29న తెలంగాణ వచ్చుడో కేసీఆర్ సచ్చుడో అనే నినాదం తోటి అమరణ నిరాహార దీక్ష ప్రారంభించినా తరువాత ప్రతిస్పందనగా అమరుల త్యాగాలు, కోట్లాది తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు ఆనాడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమవుతుంది అని అధికారికంగా ప్రకటించిందని తెలిపారు. డిసెంబర్ 9 మనకు నేర్పిన గొప్ప పాఠం అని ప్రజలు ఏకమైతే చరిత్రలు మారుతాయనీ హక్కుల కోసం నిలబడ్డప్పుడు ప్రభుత్వాలు తల వంచుతాయి అని కార్పొరేటర్ అన్నారు. మన ఉద్యమానికి వచ్చిన ఫలితాన్ని గౌరవిస్తూ మన తెలంగాణను అభివృద్ధి మార్గంలో మరింత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గొట్టుముక్కుల పెద్ద భాస్కర్ రావు, జగదీష్ గౌడ్ ,వేముల ఆంజనేయులు, ప్రవీణ్, యశ్వంత్ ,కృష్ణారావు, సత్యనారాయణ, విక్రమ్, మోహన్ రావు, యాదగిరి, వాసు,రామచందర్, రామ్మూర్తి, అనిల్, శ్రీనివాస్ ,శంకర్, లక్ష్మణ్, రవి, బాబు, కొండలరావు, రాజు, రాజశేఖర్, శ్రీను, జై, రమేష్ రావు,హరి, కిరణ్, నాగేష్, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్, రాజు, కె.వి. రావు, యూసుఫ్, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

# బీసీ ఉద్యమంలో సాయి ఈశ్వర్ చారి అమరుడు కావడం బాధాకరం

## బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి..



ఏ ఎం న్యూస్ ఓయూ: తెలంగాణ ఉద్యమంలో తొలి అమరుడు శ్రీకాంతాచారి అయితే , బిసి ఉద్యమంలో సాయి ఈశ్వర చారి తొలి అమరుడు కావడం బాధాకరమని బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి అన్నారు. బుధవారం రాత్రి గన్ పార్కు అమరవీరుల స్థూపం వద్ద జాజుల శ్రీనివాస్ గౌడ్, మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్, బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, గుజ్జ కృష్ణ, మనీ మంజరి బీసీ సంఘాల నాయకులు కొవ్వొత్తుల ప్రదర్శనతో సాయి ఈశ్వర చారికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల కోసం ఆత్మబలిదానం చేసుకున్న సాయి ఈశ్వర చారి మరణం బిసి ఉద్యమంలో చివరి మరణం కావాలన్నారు. బిసిలకు ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించడం వల్లే ఈ మరణం సంభవించిందన్నారు. సాయి ఈశ్వర చారి కుటుంబానికి ప్రభుత్వం కోటి రూపాయల ఎక్స్ గ్రేషియాతో పాటు భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ,300 గజల స్థలం ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రేజర్వేషన్లు కల్పిస్తేనే అమరుడు సాయి ఈశ్వర చారి ఆత్మ శాంతి చేకూరుతుందని అన్నారు. రిజర్వేషన్లు సాధించే వరకు బిసిలు సహనం కోల్పోకుండా బరిగెసి కొట్లాడలని పిలుపు నిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి కారణంగానే సాయి ఈశ్వర చారి బలిదానం చేసుకున్నారని ఆరోపించారు. సాయి ఈశ్వర చారి మృతితో రోడ్డున పడ్డ ఆయన కుటుంబానికి బిసి సమాజం అండగా ఉంటుందన్నారు. బీసీ రిజర్వేషన్ అంశంపై ఈనెల 14 15న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతున్నామని తెలిపారు. 42 శాతం రిజర్వేషన్లకు మద్దతుగా కేంద్ర మంత్రులు ప్రతిపక్ష నాయకులను కలిసి వినతి పత్రం సమర్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వల్లబోజు నరసింహ చారి బీసీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉస్మానియా యూనివర్సిటీలో ఉన్నా 70 ఏళ్ల బస్తీల సమస్యలు సీఎం దృష్టికి

## - తార్నాక అభివృద్ధికి రూ.25 కోట్ల బడ్జెట్ డిమాండ్
## - డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి



ఏ ఎం న్యూస్ ఓయూ: ఉస్మానియా యూనివర్సిటీ సందర్శించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, టిటియూసీ రాష్ట్ర అధ్యక్షులు శోభన్ రెడ్డితో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రివర్యులను యూనివర్సిటీలో ఘనంగా స్వాగతించి వేదికపైకి ఆహ్వానించారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి తార్నాక డివిజన్ ప్రజల తరఫున పలు కీలక సమస్యలపై ముఖ్యమంత్రివర్యులకు సమగ్రంగా వివరించి, వాటి పరిష్కారానికి సంబంధించి విజ్ఞప్తి పత్రాన్ని సమర్పించారు. ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో గత 70 సంవత్సరాలుగా సుమారు తొమ్మిది బస్తీల్లో వేలాది కుటుంబాలు నివసిస్తూ వస్తున్నాయని తెలిపారు. సుమారు 90 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ బస్తీలు, మౌలిక సదుపాయాల లేమి, గత ప్రభుత్వాల నిర్లక్ష్యం, యూనివర్సిటీ యాజమాన్యం అవసరమైన సౌకర్యాలను నిలిపివేయడం వంటి కారణాల వల్ల తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో, ఆయా బస్తీల ప్రజలకు శాశ్వత పునరావాసం కల్పించే దిశగా ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోనే 20 ఎకరాల భూమిని కేటాయించి, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రివర్యులను వినయపూర్వకంగా కోరారు. ఈ ప్రతిపాదన అమలుతో యూనివర్సిటీ యాజమాన్యానికి సుమారు 70 ఎకరాల భూమి స్వేచ్ఛగా లభిస్తుందని, ఇది పరస్పర ప్రయోజనకరమని తెలిపారు. అదేవిధంగా, గత ఎంపీ ఎన్నికల సందర్భంగా మణికేశ్వర్ నగర్‌లో 50 పడకల ఆస్పత్రి నిర్మాణానికి హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేస్తూ, ఆ హామీ మేరకు ఆస్పత్రి నిర్మాణ ప్రతిపాదనను తక్షణమే మంజూరు చేయాలని కోరారు. తార్నాక డివిజన్ సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని, రోడ్లు, డ్రైనేజీ, వీధిదీపాలు, పార్కులు తదితర మౌలిక వసతుల అభివృద్ధి కోసం రూ.25 కోట్ల ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలని ముఖ్యమంత్రివర్యులను విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన ముఖ్యమంత్రివర్యులు, ఈ అంశాలపై వెంటనే వైస్ ఛాన్సలర్‌తో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## భూదేవి హిల్స్ షాలేం ఎవాంజెలికల్ చర్చ్‌లో ప్రత్యేక ప్రార్థనలు

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని భుదేవిహిల్స్ లోని షాలేం ఎవాంజెలికల్ చర్చ్ లో బుధవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ శ్యామ్ జాషువా మధిర ఆధ్వర్యంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలకు ముఖ్య అతిథిగా యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ హాజరై ప్రత్యేక ప్రార్థన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం యువనేత మాట్లాడుతూ క్రిస్మస్ సోదరులకు ఎంతో ముఖ్యమైన పండుగ క్రిస్మస్ అని అందరికి క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలియచేసారు.

## ఇంద్రా హిల్స్ స్నేహ మోడల్ స్కూల్లో క్రిస్మస్ వేడుకలు...

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఇంద్రాహిల్స్ కాలనీ స్నేహ మోడల్ స్కూల్ లో క్రిస్మస్ మాసం సందర్భంగా నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలకు ముఖ్య అతిధిగా డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హాజరై స్కూల్ యాజమాన్యం ఆధ్వర్యంలో స్కూల్ పిల్లలతో కలిసి కేక్ కట్ చేసి క్రిస్మస్ వేడుకలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ లో ఉన్న క్రైస్తవ సోదర సోదరీమణులు అందరికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, భాస్కర్ రెడ్డి, మురళి మోహన్, పోశెట్టిగౌడ్, స్నేహ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మమతరాజ్, కరస్పాండెంట్ ఎం.రాజు, స్కూల్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప దేవాలయంలో యువనేత రామ్మోహన్రావు జన్మదిన వేడుకలు...

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



కూకట్‌పల్లికి చెందిన యువ నాయకుడు మాధవరం రామ్మోహన్ రావు జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. రామ్మోహన్రావు జన్మదినాన్ని పురస్కరించుకొని అయ్యప్ప స్వామి ఆలయంలో స్వామి వారి ప్రత్యేక దర్శనం చేసుకున్నారు. అనంతరం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు గురుస్వామిని ఆలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వారి ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్ రావుని శాలువాతో వడ్డేపల్లి రాజేశ్వరరావు సన్మానించి ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిజేసి విశేషంగా సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రజలకు మరింత చేరువవుతూ ముందుకు సాగాలని ఆశీర్వదించారు.

## వెండి బంగారమవుతోంది

### బంగారంతో పోటీ పడుతున్న ధరలు
### సామాన్యులకు చుక్కలు చూపుతున్న రేట్లు

న్యూఢిల్లీ,డిసెంబర్10: నిన్నమొన్నటి వరకు పసిడి గురించి బెంగెట్టుకున్న వారంతా ఇపపుడు వెండిపైనా బెంగపడుతున్నారు. బంగారం లాగే వెండి కూడా బంగారమయ్యింది. వెండి ధరల గురించి చర్చించుకుంటున్నారు. బంగారంతో పాటు ఇన్నాళ్లు పెరిగిన వెండి.. ఇప్పుడు పసిడిని దాటేసి పరుగులు పెడుతోంది. తాజాగా అంతర్జాతీయ మార్కెట్‌లో మునుపెన్నడూ లేని విధంగా ఔన్సు 60 డాలర్లు దాటేసింది. దీన్ని అనుసరించి దేశీయంగానూ వెండి ధర భారీగా పెరిగింది. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో బుధవారం రూ.1.92 లక్షలు పలుకుతోంది. సరిగ్గా ఏడాదిక్రితం తొలిసారి రూ.లక్ష మార్కును దాటిన వెండి.. ఇప్పుడు రూ.2 లక్షల మార్కు దిశగా దూసుకెళుతోంది. అంతర్జాతీయ విపణిలో గత కొన్ని రోజులుగా 50 డాలర్లు పైన ట్రేడయిన వెండి ఒక్కసారిగా దాదాపు 5 శాతం మేర పెరిగింది. అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న అంచనాలు, సరఫరాలో అంతరాలు దీనికి కారణమని అనలిస్టులు పేర్కొంటు న్నారు.

## భరత్ నగర్ కాలనీలో ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ

### ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్న జనసేన నాయకులు ముమ్మారెడ్డి ప్రేమ కుమార్


ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



కూకట్పల్లి నియోజకవర్గం పరిధిలోని భరత్‌నగర్ కాలనీలోని పోచమ్మ తల్లి గుడి వెనకాల వెంకట్రావు, సుజాత దంపతుల కుమారుడు వరుణ్ తేజ ఘంట స్వామి,కుమార్తె దీక్షిత అయ్యప్పస్వామి భక్తులు విశేష భక్తి శ్రద్ధలతో వర్రే నాగరాజు గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమానికి రామ్మోహన్ ఆహ్వానం మేరకు జనసేన పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇంచార్జి ముమ్మారెడ్డి ప్రేమకుమార్ ప్రత్యేక అతిథిగా హాజరై భక్తులతో కలిసి అయ్యప్ప స్వామి వారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా గురుస్వాములు ముమ్మారెడ్డి ప్రేమకుమార్‌ని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమానికి జనసేననాయకులు కొల్లాశంకర్, పోలే బోయిన శ్రీనివాస్, పులగం సుబ్బు,అశోక్‌గురుస్వామి, మణికంఠగురుస్వామి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## జగద్గిరిగుట్ట శ్రీనివాస్ నగర్‌లో ఘనంగా మహాపడిపూజ

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



జగద్గిరిగుట్ట పరిధిలోని శ్రీనివాస్ నగర్‌లో అత్యంత అందంగా అలంకరించిన మండపంలో, గురుస్వాములు శ్రీనివాస్ పోరెడ్డి హనుమంత్ రెడ్డి ల సౌజన్యంతో, అరుణ్ గురుస్వామి ఆశీస్సులతో పోరెడ్డి నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో శ్రీ అయ్యప్ప స్వామి మహా పడిపూజ మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. బ్రహ్మర్షి రమేష్ ఋషి కరకమలములచే జరిగిన పూజా కార్యక్రమం, నార్సింగి నర్సింగారావు గారి భజనలతో మరింత శోభాయమానంగా కొనసాగింది. ప్రత్యేక అలంకరణలతో వెలుగులీనిన ఈ మహోత్సవం భక్తుల ఆధ్యాత్మిక భక్తిరసంతో కళకళలాడింది. ఈ సందర్భంగా పోరెడ్డి నారాయణ రెడ్డి ఆహ్వానం మేరకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు గురుస్వామి పడిపూజలో పాల్గొని స్వామివారి దివ్యదర్శనం గావించి స్వామివారి అనుగ్రహం పొందారు. పూజా కార్యక్రమాల్లో గురుస్వాములు, పెద్దలు, వందలాది మంది భక్తులు పాల్గొని స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరుసగా కూర్చొని భజనలు, పవిత్ర నామస్మరణలు చేసిన భక్తులతో మొత్తం కార్యక్రమం ఆధ్యాత్మికతతో నిండిపోయింది. ఈ మహా పడిపూజ సందర్భంగా నిర్వాహకులు వడ్డేపల్లి రాజేశ్వరరావుని ఘనంగా సన్మానించారు.

## శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో డి. శ్రీరాములు సాగర్ ఆధ్వర్యంలో ఘనంగా మహా పడిపూజ కార్యక్రమం

### పూజలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



కూకట్‌పల్లి వివేకానంద నగర్‌లోని అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం గురుస్వామి శ్రీరాములు సాగర్, కుమారులు శ్రీకాంత్, శ్రీరామ్ స్వాముల ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహా పడిపూజ మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా శ్రీరాములు ఆహ్వానం మేరకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు గురుస్వామి ప్రత్యేకంగా పాల్గొని అయ్యప్ప స్వామివారి దివ్య దర్శనం గావించారు. తరువాత పడి పూజలో భాగంగా పాల్గొన్న రాజేశ్వరరావు గురుస్వామికి కృతజ్ఞతలు తెలుపుతూ శ్రీరాములు సాగర్ సన్మానం చేశారు. ఈ మహోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అయ్యప్ప స్వామి ఆశీస్సులు పొందారు.



### షాహీ ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్

## కార్మికుల నిరసన దీక్ష మూడో రోజు

### 17 వందల మంది మహిళా కార్మికులు

ఏ ఎం న్యూస్ ఓయూ :



నాచారం షాహీ ఎక్స్పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ 17 వందల మంది మహిళా కార్మికుల నిరసన దీక్ష మూడోరోజు కొనసాగింది. మాజీ ఉప్పల్ శాసనసభ్యులు NVSS ప్రభాకర్ ప్రభాకర్ మహిళా కార్మికుల మాద్దతుగా వారి మధ్యలోనే వుంటూ యాజమాన్యంతో చర్చలు జర్పినప్పటికి స్పష్టమైన హామీ ఇవ్వకపోవడం, యాజమాన్యం మహిళా కార్మికులపై అసభ్య పదజాలంతో దూశిం చడం, యాజమాన్యం చేస్తున్న దౌర్జన్యంలపై కార్మిక కమీషనర్‌కి, జాతీయ మానవ హక్కుల కమిషన్, మహిళా కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించి, యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్‌గౌడ్, ఉప్పల్ అసెంబ్లీ కన్వీనర్ దేవసాని బాల చందర్, తిరుపతి సత్యనారాయణ, తెలంగాణ సంపత్, రాజిరెడ్డి, క్రాంతికుమార్,పుప్పాల వెంకటేష్, రవీంద్ర సాగర్,మంజులవాని, కృష్ణారెడ్డి పాల్గొని కార్మికులకు సంఘీభావం తెలియజేశారు.

## సీఎం రేవంత్ రెడ్డి చరిత్రలో నిలిచాడు

### - చనగాని దయాకర్ టీపీసీసీ జెన్రల్ సెక్రటరీ

ఏ ఎం న్యూస్ ఓయూ:



వంద ఏళ్ల ఓయు కు ఎన్నో సమస్యల సుడి గుండాలను పూర్తిగా తొలగించారు. నిధులు లేక బోసిపోయిన ఓయును సిరులు కురిపించారు. 75 ఏళ్ల నుండి ఎవరికి దక్కని గౌరవం సీఎం రేవంత్ రెడ్డి దక్కింది.'1000 కోట్ల తో కూడిన ఓయు అభివృద్ధి కి దశ దిశను మార్చింది..ఓయు గోడల పైన రేవంత్ రెడ్డి వేస్తున్న అభివృద్ధి శిలపలా కాలు మరో వంద ఏళ్లు అభివృద్ధి భిజం వేశారు ఓయు అంటే పోరాటాలు కాదు సమాజానికి కావలిసిన ఉద్యోగాలు ఇచ్చే యంత్రాలుగా తెలంగాణ ప్రభుత్వం లో భాగం కానుంది.పేద పిల్లల భవిష్యత్ కు బాటలు వేశారు.

### సీఐ గణేష్ పటేల్‌కి వినతి పత్రం సమర్పించిన

## అధ్యక్షుడు గోకుల్, జెనరల్ సెక్రటరీ టి.లక్ష్మీ దుర్గా..

ఎ ఎం న్యూస్ పఠాన్ చెరు:



తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం మండలం పటాన్ చెరు నియోజకవర్గం ప్రస్తుతం జిహెచ్ఎంసి లో కలిసిన తెల్లాపూర్ (మాజీ మున్సిపాలిటీ)లోని కొల్లూరు రోడ్డు పడకల సముదాయం 15-1-బ్లాక్ 7/112లో గ్రేస్ వింగ్స్ ఫెలోషిప్ మినిస్ట్రీస్ పేరుతో క్రిస్టియన్ కమ్యూనిటీ అసోసియేషన్ ఏర్పడింది ఈ అసోసియేషన్ అధ్యక్షుడు గోకుల్, జనరల్ సెక్రటరీ టీ. లక్ష్మీ దుర్గా బుధవారం కొల్లూరు పోలీస్ స్టేషన్ కి వెళ్లి సిఐ గణేష్ పటేల్ ని మర్యాదపూర్వకంగా కలిసి గ్రేస్ వింగ్స్ ఫెలోషిప్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఈనెల 20వ తారీకు(20 డిసెంబర్ 2025) సాయంత్రం నాలుగున్నర నుండి రాత్రి 10:30 వరకు జరిగే క్రిస్టియన్ ఉత్సవాలకు (సుమారు 1000 మంది క్రైస్తవ సోదరులు పాల్గొనే సభ) అనుమతి కోసం వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రేస్ వింగ్స్ మినిస్ట్రీస్ సభ్యులు కూడా పాల్గొన్నారు.

### జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేకి, స్థానిక కార్పొరేటర్‌కి

## ధన్యవాదాలు తెలిపిన రాహుల్ నాయక్

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :



రహమత్ నగర్ డివిజన్( జూబ్లీహిల్స్ నియోజకవర్గం) సంజయ్ నగర్ లో గత పది సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న ముఖ్య సమస్య సివరేజ్ లైన్ కి సంబంధించిన సమస్య. ఈ పనులను అమలు చేయాలని ఆదేశించి, పనులను మంజూరు చేయించి, పైపుల ను త్వరిత గతిన సంజయ్ నగర్ కు తెప్పించిన జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎమ్మెల్యే వి నవీన్ యాదవ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు సంజయ్ నగర్ బస్తీ వాసులు, సంజయ్ నగర్ నాయకులు రాహుల్ నాయక్, బాలకృష్ణ . ఈ కార్యక్రమంలో తాను ఒక భాగమైన స్థానిక( రహ మత్ నగర్ డివిజన్) కార్పొరేటర్ సిఎన్ రెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు రాహుల్ నాయక్ , బాలకృష్ణ.

## చెక్కు ఇప్పించిన శ్రీనగర్ కాలనీ ఎంఐఎం అధ్యక్షుడు షేక్ జాఫర్

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :



తెలంగాణ రాష్ట్రం హైదరాబాదులోని జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహమత్ నగర్ డివిజన్ కార్మిక నగరకు (ఇంటి నెంబర్ 8-3-228/678/768) చెందిన పి సుభాష్ (తండ్రి, పి. ఆనందరావు)గత కొన్ని రోజుల కిందట అనారోగ్యానికి గురై చికిత్స పొందారు. చికిత్స పొందిన ఆసుపత్రి పత్రాలను జతపరిచి ముఖ్యమంత్రి సహాయ నిధి కొరకు దరఖాస్తు చేసుకున్నారు సుభాష్. వారి దరఖాస్తును పరిశీలించిన అధికారులు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి వారికి 28 వేల రూపాయల చెక్కు( 7/12/2025 తేది ఉన్న) మంజూరు చేశారు. ఈ మంజూరు అయిన చెక్ ను తెలంగాణ రాష్ట్రం హైదరాబాదు లోని ఎంఐఎం పార్టీ శాఖ ముఖ్య కేంద్రం దారు సలాం లో ఎంఐఎం పార్టీ ఎమ్మెల్సీ( హైదరాబాద్) మీర్జా రియాజ్ ఉల్ హాసన్ అఫెండి చేతుల మీదుగా ఎంఐఎం శ్రీ నగర్ కాలనీ బ్రాంచ్ అధ్యక్షుడు షేక్ జాఫర్ సమక్షంలో లబ్ధిదారుడైన సుభాష్ కి బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో షేక్ జాఫర్ తో పాటు సయ్యద్ ఆసిఫ్,సురేశ్, రఫీక్, అన్వర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుభాష్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ మేజా రియాజే ఉల్ హసన్ అఫెండి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన వెంట ఉండి తనకు సాయం చేసిన షేక్ జాఫర్ ను ఎప్పటికీ మర్చిపోను అని అన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతి పత్రం ఇచ్చిన జార్జిరెడ్డి PDSU నేతలు

ఏ ఎం న్యూస్ ఓయూ:
ఉస్మానియా యూనివర్సిటీ పర్యటనలో భాగంగా ఆర్ట్స్ కాలేజ్ కి వచ్చిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యంత్రి రేవంత్ రెడ్డికి జార్జిరెడ్డి పి.డి.ఎస్.యూ ఓయూ కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా జార్జిరెడ్డి పి.డి.ఎస్.యూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్.ఎస్.నాగేశ్వర రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.సుమంత్, రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్,ఓయూ అధ్యక్షులు కె.స్వాతి లు మాట్లాడుతూ ఓయూ అభివృద్ధి కి రూ. 1000 కోట్లు నిధులపై జీ.ఓ విడుదల చేయడం పట్ల, టీచింగ్ పోస్టులు భర్తీ ప్రకటన పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థుల సమస్యలను అధ్యయనం చేసి జార్జి రెడ్డి పి.డి.ఎస్.యూ స్టూడెంట్ ఎజెండాను రూపొందించిందని ఆ ఎజెండా అమలుకు ప్రభుత్వం కృషి చేయాలని, ఓయూ విద్యార్థుల అభివృధి, సంక్షేమం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి కి ఇచ్చిన వినతి పత్రం లోని ప్రధాన అంశాలు:
ఓయూ విద్యార్థులకు ఉచిత మెస్ వసతి కల్పించాలి. మెస్ డిపాజిట్ల పేరుతో ఫీజుల వసూలు చేసే పద్దతిని రద్దు చేయాలి. ఓయు విద్యార్థులకు ఉచిత హెల్త్ ఇన్సూరెన్స్ ఇవ్వాలి. ఓయు రీసెర్చ్ స్కాలర్స్ కు, స్టూడెంట్స్ కు రాష్ట్ర ప్రభుత్వం నుండి ప్రతి నెల ఫెలోషిప్ ఇవ్వాలి. ఓయూ విద్యార్థుల స్కాలర్షిప్ పెంచాలి యూనివర్సిటీలో పెంచిన కోర్సు ఫీజులు, ఎగ్జామినేషన్ ఫీజులు తగ్గించాలి. ఓయూ లోని సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులరైజ్ చేయాలి. డబుల్ పీ.జీ విద్యార్థులకు కూడా ఫీజు రీయింబర్స్మెంట్ అందించాలి. పెంచిన ఫీజులు తగ్గించాలి. ఓయులో అడ్మిషన్ పొందిన ప్రతి విద్యార్థికి హాస్టల్ వసతి కల్పించాలి. ఓయూలో రద్దు చేసిన 2017, 2018 పి.ఎచ్.డి అడ్మిషన్లను పునరుద్ధరించాలి. వారి థీసెస్ సబ్మిషన్ కోసం వన్ టైమ్ చాన్స్ ఇవ్వాలి. టీచింగ్ ,నాన్ టీచింగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలి. ఓయూ అభివృద్ధికి రూ.1000 కోట్ల నిధులు విడుదల చేయాలి. పెండింగ్ లో ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ నిధులు పూర్తి స్థాయిలో విడుదల చేయాలి. విద్యా సంస్థల్లో విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలి. ఓయూ విద్యార్థులకు మౌలిక సదుపాయాలు మెరుగు పరచాలి. సమస్యలు పరిష్కరించాలి. ఓయూ భూములు పరిరక్షించాలి. ప్రతిరాష్ట్రబడ్జెట్లో ఓయూఅభివృద్ధికిరూ.1000 కోట్లు నిధులు కేటాయించి, విడుదల చేయాలి. ఓయూ అటాన మస్ను గౌరవించాలి.క్యాంపస్ డెమోక్రసీనిపరిరక్షించాలి. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్లను సకాలంలో విడుదలచేయాలి తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థిఉద్యమకారులకు న్యాయం చేయాలి. ఈ కార్యక్రమంలో జార్జిరెడ్డి PDSU ఉస్మానియా యూనివర్సిటీ. డాక్టర్.ఎస్.నాగేశ్వరరావు (రాష్ట్రఅధ్యక్షులు,ఓయూ) ఎన్.సుమంత్ (రాష్ట్ర ప్రధాన కార్యదర్శి) కె.స్వాతి (స్టేట్ గర్ల్స్ కన్వీనర్ &ఓయూ ప్రెసిడెంట్) ఏం.వెంకటేష్ (గ్రేటర్ హైదరా బాద్ జిల్లా అధ్యక్షులు )ఎస్.అంజి (గ్రేటర్ హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి) ఎస్.కె.రుక్మత్ పాషా (ఓయూప్రధాన కార్యదర్శి)





# ఎల్.వో.సి.ని అందజేసిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే

ఎ ఎం న్యూస్, జూబ్లీహిల్స్:
సోమాజిగూడ డివిజన్(జూబ్లీహిల్స్ నియోజకవర్గం) ఎల్లారెడ్డిగూడ లోని వడ్డెర బస్తిలో గల గవర్నమెంట్ హై స్కూల్( నెంబర్ 1) లో కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన తెలంగాణ ప్రధాత, రాజ్యసభ సభ్యులు సోనియా గాంధీ పుట్టిన రోజు వేడుకలను విద్యార్థిని విద్యార్థుల మధ్య ఘనంగా మంగళవారం నిర్వహించారు ఈ కార్యక్రమానికి వారి ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్. ముఖ్య అతిథిగా వచ్చిన ఎమ్మెల్యేకు శాలువాతో ఘనంగా సన్మానించారు కార్పొరేటర్ వనం సంగీత శ్రీని వాస్ యాదవ్. వారి టీం తో ఏర్పాటుచేసిన ప్రత్యేక కేక్ కటింగ్ లో పాల్గొని కేక్ కట్ చేసి విద్యార్థిని, విద్యార్థులకు పంచిపెట్టారు. కేకుతో పాటు పిల్లలకు పెన్నులు పంచిపెట్టారు ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వనం శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు డివిజన్ లోని అంబేద్కర్ నగర్ నివాసి గణేష్ కి మంజూరైన రెండు లక్షల యాభై వేలు ( 2'50' 000 )– రూపాయల ఎల్. వో. సి. ని ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్ చేతుల మీదుగా అందజేశారు కార్పొరేటర్ మనం సంగీత శ్రీనివాస్ యాదవ్. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సి. కిరణ్ యాదవ్, మనోజ్ యాదవ్, యాదయ్యతో పాటు డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.



# నాణ్యత ప్రమాణాలు పాటించండి

## - కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి..

ఎ ఎం న్యూస్, జూబ్లీహిల్స్:



తెలంగాణ రాష్ట్రం హైదరాబాదు జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహమత్ నగర్ డివిజన్లోని ఓం నగర్ లో 49 లక్షల వ్యయంతో, కార్మిక నగర్ 40 లక్షల వ్యయం తో జరుగుతున్న అభివృద్ధి పనులను సోమవారం కార్పొరేటర్ సి.ఎన్. రెడ్డి పరిశీలించారు. పనుల పురోగతిని వివరంగా సమీక్షించిన ఆయన, నాణ్యత ప్రమాణాలు పాటించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏ. ఈ.భరత్, వర్క్ ఇన్స్పెక్టర్ వనిధర్ తో పాటు డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

# పెట్టుబడులకు హైదరాబాద్ బెస్ట్ డెస్టినేషన్ సీఎం రేవంత్ రెడ్డి కృషి భవిష్యత్తరాలకు భరోసా....

**టీపీసీసీ అధికార ప్రతినిధి, తెలంగాణ నేరేడ్కో ఉపాధ్యక్షులు డా .సత్యం శ్రీరంగం.**

ఏ ఎమ్ న్యూస్ కూకట్పల్లి :



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుచూపు గల నాయకత్వంలో తెలంగాణ తన సాహసోపేతమైన, భవిష్యత్ దృక్పథాన్ని జీవం పోస్తోందనీ పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి, తెలంగాణ నేరేడ్కో ఉపాధ్యక్షులు డా .సత్యం శ్రీరంగం పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మీర్ఖాన్పేట్లోని భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ రెండో రోజు కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్ లతో కలిసి పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి, తెలంగాణ నేరేడ్కో ఉపాధ్యక్షులు డా. సత్యం శ్రీరంగం పాల్గొన్నారు. ఈ సందర్బంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ అంతర్జాతీయ పెట్టుబడుల ఆకర్షణ, తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరించే లక్ష్యంగా నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్కు అత్యుత్తమ స్థాయిలో ఏర్పాట్లు చేసారన్నారు. 2047 నాటికి %వి%3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థను సాధించడానికి ధైర్యమైన మౌలిక సదుపాయాల విస్తరణ మరియు స్పష్టమైన రోడ్ మ్యాప్తో తెలంగాణ కొత్త వృద్ధి దశలోకి ప్రవేశిస్తోంది అన్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ రెండు రోజులకు కలిపి 5,39,495 లక్షల కోట్లు పెట్టుబడులు, డీప్ టెక్, గ్రీన్ ఎనర్జీ, ఏరోస్పేస్ రంగాల్లో పెట్టుబడులు, రాష్ట్రాభివృద్ధికి, ఉద్యోగాల కల్పనకు ఈ పెట్టుబడులు దోహదం చేస్తాయి అన్నారు. పాలనా విధానాల్లో స్పష్టత, అభివృద్ధి ప్రణాళికలో వేగం, భవిష్యత్తు విషయంలో ఆశావాహ దృక్పథంతో తెలంగాణ పరుగులు తీస్తుందని చెప్పడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఫ్యూచర్ సిటీలో తెలంగాణ రైజింగ్ 2047 గ్లోబల్ సమ్మిట్ పెద్ద ఎత్తున నిర్వహిస్తుందన్నారు. ప్రస్తుతం తెలంగాణ ఎకానమీ 185 బిలియన్ డాలర్లుగా ఉంది. రాబోయే 22 ఏళ్లలో ఈ ఎకానమీని 3 ట్రిలియన్ డాలర్లకు పెంచడమే మా లక్ష్యం అని అన్నారు. ఉద్యోగిత, ఉపాధికల్పన, ఆర్థికాభివృద్ధి సాధనే రేవంత్ పాలనా ప్రధాన లక్ష్యంగా సాగుతుంది అన్నారు. తెలంగాణ విజన్ విశ్వవ్యాప్తంగా విస్తరింపచేసి పెట్టుబడులను, పరిశ్రమలను ఆహ్వానించి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో బలోపేతం చేసే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. సబ్బండ వర్గాలు బలమైన ఆశయాలతో పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రానికి ప్రపంచ పటంలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావడానికి అహర్నిశలు కృషి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ' తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 'ను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది అన్నారు. దేశంలో అన్ని రంగాల్లో తెలంగాణను అగ్రస్థానంలో నిలపడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర ప్రగతికి ప్రత్యేక ప్రణాళికలు రచిస్తూ తెలంగాణ ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయాలతో ' తెలంగాణ రైజింగ్ 2047 ' లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు.

# కూకట్పల్లిలో ఘనంగా ఎఐసిసి నాయకురాలు సోనియా గాంధీ జన్మదిన వేడుకలు...

ఏ యం న్యూస్ కూకట్పల్లి :



ఏఐసిసి నాయకురాలు సోనియాగాంధీ 79వ జన్మదిన వేడుకలు కూకట్పల్లి నియోజకవర్గంలో మంగళవారం పార్టీ నాయకులు కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గం పార్టీ కార్యాలయం హేమదుర్గ భవన్ లో టిపిసిసి ఉపాధ్యక్షుడు జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ఆధ్వర్యంలో భారీగా హాజరైన కాంగ్రెస్ కార్యకర్తల ఆనందోత్సాహాల మధ్య గొప్పగా జరిగాయి. ఈ సందర్భంగా బండిరమేష్ కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచారు .ఈ సందర్భంగా బండిరమేష్ మాట్లాడుతూ సోనియా గాంధీ గొప్ప మానవతా మూర్తి అని తెలంగాణ ఇవ్వడం వల్ల పార్టీ ప్రయోజనాలకు పెద్ద ఎత్తున నష్టం జరుగుతుందని తెలిసినా ఇక్కడ ప్రజల మనోభావాలను గౌరవించి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసి సోనియా గాంధీ గొప్ప త్యాగం చేసిందని కొనియాడారు. ప్రత్యేక రాష్ట్రం ఇస్తే తమ పార్టీని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేస్తానని కెసిఆర్ సోనియా అమ్మను నమ్మించి మోసం చేశారని రమేష్ ధ్వజమెత్తారు. డైనమిక్ సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ అన్ని రంగాల్లో సర్వతోముఖాభివృద్ధిని సాధిస్తుందన్నారు. గత పాలకుల కారణంగా సంపన్నమైన రాష్ట్రం అప్పుల పాలైన వాటిని తీపిస్తూ ఎన్నికల హామీలను రేవంత్ రెడ్డి నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్ ను ప్రపంచ పటంలో సగర్వంగా నిలబెట్టేందుకు రేవంత్ రెడ్డి విశేష కృషి చేస్తున్నారని రమేష్ కితాబునిచ్చారు. విద్య వైద్యరంగంలో పేద ప్రజలకు పెద్ద ఎత్తున లబ్ధి చేకూరేలా రేవంత్ రెడ్డి చర్యలు తీసుకున్నారు అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, బ్లాక్ అధ్యక్షులు, మార్కెటింగ్ కమిటీ మెంబెర్స్, టెంపుల్ కమిటీ మెంబర్స్, డివిజన్ అధ్యక్షులు, బ్లాక్ మహిళా అధ్యక్షురాలు, డివిజన్ మహిళా అధ్యక్షురాలు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్ యుఐ నాయకులు, మైనారిటీ నాయకులు, ఎస్సీ సెల్ నాయకులు, బీసీ సెల్ నాయకులు, సేవ్ దళ్ నాయకులు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మానవసేవే మాధవసేవగా ముందుకు వెళుతున్న రాధిక

ఎ ఎం న్యూస్, జూబ్లీహిల్స్:
ఎక్కడ ఆపద ఉంటే ఆ విషయం ను తెలుసుకొని తన టీం ను పంపించి నిర్ధారణ చేసుకొని తన వంతు సహాయంగా వారికి సహాయం చేస్తూ వస్తున్నారు రాధిక చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు, చైర్ పర్సన్ రాధిక. సొంత ఇంటి వారే తన సొంత వాళ్లను పట్టించుకోని ఈ రోజులలో మానవసేవే మాధవ సేవగా ముందుకు వెళ్తున్నారు రాధిక. అదే క్రమంలో తెలంగాణ రాష్ట్రం ఐ.టీ.కి తలమానికంగా ఉన్న హైటెక్ సిటీ లో ఉన్న ఎంఎంటీఎస్ సమీప ప్రాంతంలో ఉన్న జిహెచ్ఎంసి ప్లే గ్రౌండ్లో 100 మంది ట్రాన్స్ జెండర్లకు తనవంతు సహాయంగా ఇంటికి సంబంధించిన కనీస అవసరాలను( రైస్, వివిధ రకాల) అందించారు. ఈ కార్యక్రమంలో మొదటి ట్రాన్స్ జెండర్ రిపోర్టర్, అడ్వైసర్ ఆసిపా నిషా పాల్గొన్నారు. సమస్యలను తెలుసుకుంటూ తన వంతు రాధికా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సహాయం చేస్తున్న రాధిక ను పలువురు అభినందిస్తున్నారు.




# సోనియాగాంధీ పుట్టినరోజు వేడులను ఘనంగా నిర్వహించిన రాధిక..

ఎ ఎం న్యూస్, జూబ్లీహిల్స్:



తెలంగాణ ప్రదాత, రాజ్యసభ సభ్యురాలు సోనియా గాంధీ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా జాయింట్ సెక్రటరీ రాధిక. ప్రత్యేక కేకు తెప్పించి కాంగ్రెస్ పార్టీ సీనియర్ మహిళల మధ్య కేక్ కట్ చేశారు రాధిక. ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతు సోనియాగాంధీ పుట్టినరోజు, మనకి తెలంగాణ ప్రకటించిన రోజు( సోనియా గాంధీ తెలంగాణ ప్రక్రియ ను మొదలు పెట్టాలని ఆదేశించిన రోజు) ఒకే రోజు కావడం నాకు సంతోషంగా ఉందని అన్నారు ఎ.ఎం. న్యూస్. మీడియా ద్వారా సోనియాగాంధీ కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్నాను అని అన్నారు.

## మాగంటి సునీత ఆధ్వర్యంలో

# విజయ దివస్ సంబరాలు

ఎ ఎం న్యూస్, జూబ్లీహిల్స్:





డిసెంబర్ 9 ని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలకంగా మారిన రోజుని గుర్తు చేసుకుంటూ జూబ్లీహిల్స్ నియోజకవర్గం యూసుఫ్ గూడా డివిజన్ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విజయ్ దివాస్ సంబరాలను ఘనంగా నిర్వహించారు జూబ్లీహిల్స్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి సునీత. ఈ కార్యక్రమంలో యూసఫ్ గూడా డివిజన్ కార్పొరేటర్ రాజ్ కుమార్ పటేల్, వెంగళరావు డివిజన్ కార్పొరేటర్ దేదీప్య విజయ్ రావు పాల్గొన్నారు. ప్రత్యేక కేక్ తెప్పించి బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, వివిధ హొదాల నాయకులు, మహిళా నాయకురాళ్ల మధ్య కట్ చేశారు మాగంటి సునీత గోపీనాథ్. ఈ సందర్భంగా సునీత గోపీనాథ్ మాట్లాడుతూ తెలంగాణ వచ్చుడు కేసీఆర్ సచ్చుడు అని నినాదానంతో ముందుకెళ్లిన ( కెసిఆర్ చేసిన నిరాహార దీక్ష ఫలితం) గొప్ప రోజు అని అన్నారు.

# ఇస్లాంలో మానవ హక్కుల రక్షణ కవచం..

## - మానవ హక్కుల దినోత్సవం
## - ఖాజీ ముహమ్మద్ ఇస్మాయిల్ నిజామి ఉపాధ్యక్షుడు జమాత్ ఏ ఇస్లామి హింద్ టెహ్రీస్ కౌన్సిలర్ హింద్ మజ్దూర్ సభ హెచ్ఎంఎస్ జాతీయ కార్యదర్శి

**హైదరాబాద్, డిసెంబర్ 10 :**
బుధవారం 8 ఇంక్లైన్ కాలనీలో జరిగిన ప్రోగ్రామ్లో ఇస్మాయిల్ నిజామీ 10 డిసెంబర్ నెల మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా మాట్లాడుతు టెక్నాలజీలో ఎక్కడికో దూసుకుపోతున్న ఈ రోజుల్లో కూడా, జాతి వైషమ్యాలు, అసమానతలు మనల్ని ఇంకా వెంటాడు తున్నాయి. తరతరాలుగా వస్తున్న ఈ బాధకు పరిష్కారం లేదా? మనం జీవిస్తున్న ఈ యుగం అపూర్వమైన సాంకేతిక వైభవాన్ని చూస్తోంది. మన చేతుల్లో ప్రపంచమే ఉంది. కానీ, దురదృష్టవశాత్తు, చరిత్రలో మానవాళిని పీడించిన పక్షపాతాలు, అసమానతలు, అన్యాయాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ఈ చీకటి మనల్ని అంతులేని మానవ బాధల్లోకి నెట్టివేస్తోంది. సరిగ్గా ఈ కష్టకాలంలోనే. మానవ హక్కులగురించి చర్చించడం చాలా కీలకం. మానవ హక్కులు అంటే ఏమిటి? ప్రతి మనిషికి, సమాజంలోని ప్రతి సభ్యుడికి అవి విశ్వజనీయంగా దక్కేలా మనం ఒక ఉమ్మడి అవగాహనకు రాగలమా? ఈ ప్రశ్నలు మాగ్నా కార్టా నుంచి జినీవా కన్వెన్షన్ వరకూ చారిత్రక పత్రాలలో చర్చకు వచ్చాయి.
అయితే, తరచుగా మనం మరచిపోయే ఒక కోణం ఉంది: ఈ లోతైన ప్రశ్నలను వివిధ మత సంప్రదాయాలు కూడా పరిష్కరించాయి. ప్రత్యేకించి, ఇస్లాం యొక్క మానవ హక్కులనమూనా దాని దృఢత్వం, విశాలదృష్టి, ఆధునిక కాలానికి దాని ఔచిత్యం పరంగా మనల్ని ఆశ్చర్యపరుస్తుంది. అర్థమవుతుంది. ఎందుకంటే, సామాజిక, జాతి, లింగ, మతపరమైన ప్రపంచ చరిత్రను, నేటి వాస్తవాలను చూస్తే ఇస్లాం కృషి ఎంత గొప్పదో అసీమానతలు ఎప్పుడూ ఉంటూనే ఉన్నాయి. నల్లని చర్మం ఉన్నవారిని అణచివేయడం, మత ఆధిపత్యంలో భిన్న విశ్వాసులపై హింస... నాలో ఆ చరిత్ర మన కళ్ళ ముందుంది. గ్రంథాలలో నిర్దేశించిన పవిత్ర హక్కులు వేరు, అసంపూర్ణ మానవులైన మనం వాటిని తప్పుగా అమలు చేయడం వేరు. పాశ్చాత్య సమాజాలు వివక్షకు వ్యతిరేకంగా పోరాడుతున్నట్లే, ముస్లిం సమాజాలు కూడా ఇస్లామిక్ మానవ హక్కులస్ఫూర్తిని పూర్తిగా అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నాయి.. దైవం నిర్దేశించిన హక్కులు ఇస్లాంలో మానవ హక్కులగొప్ప లక్షణం ఏమిటంటే, ఈ హక్కులు సామాజిక ప్రవర్తన నుండి సహజంగా ఉద్భవిస్తాయి. ఇవి ముస్లింలు దైవం నుండి వచ్చిన పవిత్ర ఆజ్ఞలుగా విశ్వసిస్తారు. మహిమాన్వితమైన ఖురాన్ మన హృదయాలకు ఇలా అజ్ఞాపిస్తోంది: "న్యాయం చెయ్యండి అనీ, ఉపకారం చెయ్యండి అనీ, బంధువులహక్కులు నెరవేర్చండి అనీ అల్లాహ్ అజ్ఞాపిస్తున్నాడు. చెదునూ, అశ్లీలతనూ, అన్యాయాన్నీ, మితిమీరి ప్రవర్తించటాన్నీ నిషేధిస్తున్నాడు. ఆయన మీకు హితబోధ చేస్తున్నాడు, మీరు గుణపాఠం నేర్చుకోవాలని." (ఖురాన్, 16:90-91). మానవాళి మొత్తానికి ఒకే పునాదిని ఇస్తుంది: "మానవులారా! మేము మిమ్మల్ని ఒకే పురుషుని నుండి, ఒకే స్త్రీ నుండి సృజించాము. తరువాత మీరు ఒకరినొకరు పరిచయం చేసుకునేందుకు మిమ్మల్ని జాతులుగానూ, తెగలుగానూ చేశాము. వాస్తవానికి మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ గౌరవపాత్రుడు." (ఖురాన్ 49:13) మనలను వేరు చేసేది మన భక్తి దేవునిపై మన స్పృహ మాత్రమే. మన రూపాలు, రంగులు దేవుని మహిమకు, జ్ఞానానికి నిదర్శనం. ఒకరిపై ఒకరికి ఆధిపత్యం చూపడానికి అవి కారణం కాకూడదు. జాతి వివక్ష అనేది ఇస్లాం స్ఫూర్తికి పూర్తి విరుద్ధం. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ సత్యాన్ని ఎంత అందంగా చెప్పారో చూడండి వరల్డ్ టుడే "ఒక అరబ్బుకు అరబ్బేతరుడిపై గానీ, అరబ్బేతరుడికి అరబ్బుపైగానీ, నల్లవానికి తెల్లవానిపై గానీ, తెల్లవానికి నల్లవాని పై గానీ ఎలాంటి అధికృత లేదు. మీరందరూ ఆదమ్ సంతానం. ఆదమ్ మట్టి నుండి సృష్టించబడ్డాడు." గౌరవం-సమానత్వం. మానవ హక్కులకు రెండు పునాదులు ఉన్నాయి: గౌరవం-సమానత్వం. మీరు కేవలం మనిషి అయినందుకు, అల్లాహ్ మిమ్మల్ని గౌరవించారు. ఖురాన్ ఇలా అంటోంది: "మానవులారా! మేము మిమ్మల్ని ఒకే పురుషుని నుండి, ఒకే స్త్రీ నుండి సృజించాము. తరువాత మీరు ఒకరినొకరు పరిచయం చేసుకునేందుకు మిమ్మల్ని జాతులుగానూ, తెగలుగానూ చేశాము వాస్తవానికి మీలో



అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ గౌరవపాత్రుడు. నిశ్చయంగా అల్లాహ్ సర్వజ్ఞానం కలవాడు, సకలవిషయాలు తెలిసినవాడూను." (ఖురాన్) స్త్రీ సమానత్వం: స్త్రీలు, పురుషులతో ఆధ్యాత్మికంగా సమానంగా ఉంటారు. వారు తమ ప్రార్థనలు, సత్కార్యాలకు ప్రతిఫలం పొందుతారు. పురుషులతో సమానంగా, వారు తమ కుటుంబ, సామాజిక బాధ్యతలను పంచుకుంటారు. స్త్రీలు ఆస్తిని కలిగి ఉండవచ్చు, వ్యాపారాలు చేయవచ్చు. ఓటు వేయవచ్చు, విద్యను పొందవచ్చు. ముస్లిం సమాజాలు వారికి ఈ హక్కులన్నీ ఇవ్వడంలో వెనుకబడి ఉండవచ్చు, కానీ అది దైవిక ఆదేశం యొక్క వైఫల్యం కాదు, అది కేవలం మానవ వైఫల్యం మాత్రమే జీవించే హక్కు: ప్రాణం దేవుని నుండి వచ్చిన పవిత్రమైన అప్పగింత. "హత్యకు బదులుగాగాని లేదా కల్లోలాన్ని వ్యాపింపజేసినందుకుగాని కాక మరే కారణం వల్లనైనా ఒక మానవుణ్ణి చంపినవాడు సమస్త మానవులను చంపినట్లే. ఒక మానవుడి ప్రాణాన్ని కాపాడినవాడు మొత్తం మానవులప్రాణాలను కాపాడినట్లే." (ఖురాన్, 5:32) అంటే, మన పొరుగువారిని ప్రమాదం నుండి రక్షించడం కూడా మన బాధ్యతే. యుద్ధ సమయాల్లో కూడా, ఇస్లాం గౌరవాన్ని బోధిస్తుంది. పోరాటంలో లేనివారిని (స్త్రీలు, పిల్లలు, వృద్ధులు) చంపడం నిషేధించబడింది. ప్రవక్త (సల్లల్లాహం అలైహి వసల్లం) ఒక మృతదేహాన్ని చూసి, "ఆమె పోరాడటం లేదు. మరి ఆమె ఎలా చంపబడింది?" అని ప్రశ్నించారు. ఇది ఎంద లోతైన మానవత్వం! విశ్వాసాల స్వేచ్ఛ: నిజమైన ఇస్లామిక్ రాజ్యం విభిన్నతను గౌరవించాలి. ముస్లిమేతరులు వారి మతాన్ని పాటించడానికి అనుమతించబడతారు. స్పెయిన్ ముస్లింలపాలనలో ఉన్నప్పుడు, కురుబా జ్ఞాన కేంద్రంగా ఉండేది. ఇక్కడ ముస్లిం, యూదు, క్రైస్తవ పండితులు కలిసి బోధించేవారు. సహనం అప్పటి యూరప్లో అరుదైన గుణం. ప్రాథమిక జీవన ప్రమాణం హక్కు ఆహారం, ఆశ్రయం, వైద్య సంరక్షణ... ఇవి ప్రతి మనిషి యొక్క కనీస అవసరాలు, వీటిని అందుకోవడానికి పేదవారు అర్హులు ఖురాన్ చెబుతోంది: "వారి సంపదలో యాచ కులకూ, అగత్యం కలవారికీ హక్కు ఉండేది." (ఖురాన్ 51:19) మనకు తగినంత ఉంటే, పేదరి కాన్ని నిర్మూలించడానికి ఇవ్వడం మన బాధ్యత. న్యాయం హక్కు జాతి, మతం, జాతీయతతో సంబంధం లేకుండా, స్నేహితులైనా శత్రువులైనా, ప్రతి ఒక్కరితో న్యాయంగా వ్యవహరించాలని ఇస్లాం కోరుతుంది. "(ఏదైనా) వర్గంతో ఉన్న వైరం కారణంగా మీరు ఆవేశానికి లోనయి న్యాయాన్ని త్యజించకండి. న్యాయం చెయ్యండి. ఇది డైవభక్తికి సరిసమానమైనది" (ఖురాన్ 5:8) ఈ న్యాయ భావం ఎంత అద్భుతమైనదంటే, ఇది మన రోజువారీ జీవితానికి ఆచరణాత్మక నీతిని అందిస్తుంది. పరస్పర బాధ్యత పిల్లలుగా, పొరుగువారిగా, స్నేహితుడిగా, ప్రతి వ్యక్తికి పంపారు. వా చాధ్యతలను ఇచ్చింది ఇస్లామ్ ధర్మం. ప్రపంచాన్ని సామాజిక, జాతి, లింగ సమస్యలకు ఇస్లాంను పరిష్కారం చూపింది. ఇస్లాంలో పొందుపరచబడిన ఈ హక్కులు బాధ్యతలనమూనా, వ్యక్తిగత, సామాజిక సంస్కరణకు అపారమైన శక్తిని కలిగి ఉంది. ప్రతి హక్కు ఒక బాధ్యత నుండి ఉద్భవించింది అనే ఈ సత్యాన్ని మనం గ్రహించిన రోజు, మానవజాతికి నిజమైన స్వేచ్ఛ, శాంతి లభిస్తుంద నీ వారు తెలిపరు - జె. ఐ. హెచ్. అధ్యక్షులు - గోదావరిఖని సయ్యద్ జావిద్ అక్మల్ హుస్సేనీ - అధ్యక్షథన జరిగిన ప్రోగ్రామ్ లో అబ్దుల్ రజాక్, ఫసియుద్దీన్, ముస్తఫా, అక్బర్, మక్సూద్ అహ్మద్ ఖాన్-, అహ్మద్ పాషా,ఖాజా మొయినుద్దీన్, జుబేర్ అహ్మద్, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.